## మల్లేపల్లి లో డీసీ పర్యటన



మల్లేపల్లిలో పర్యటిస్తున్న డీసీ సురేందర్‌రెడ్డి

మెహిదీపట్నం, మే 5: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లేపల్లి డివిజన్లో క్రీడా మైదానాలను డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్‌తో కలిసి సందర్శించారు. క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జాఫర్‌ఖాన్ డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. దీనికి స్పందించిన డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## లఘు చిత్రాల ఉత్తమ దర్శకుడిగా వసంత్



లఘు చిత్రాల ఉత్తమ దర్శకుడిగా ఎంపికైన నగర కళాకారుడు రామడుగు వసంత్‌ను ఆనందలహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో డీడీ కాలనీలో సత్కరించారు. దాసరి నారాయణరావు జన్మ దినోత్సవ సందర్భంగా టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్స్ అసోసియేషన్ జరిపిన పోటీలలో టెన్ టైమ్స్ షార్ట్ ఫిలింకు దర్శకత్వం వహించిన రామడుగు వసంత్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ఈ అభినందన కార్యక్రమంలో ఆనంద లహరి కన్వీనర్ కళారత్న మల్లం రమేశ్, కల్చరల్ ఆర్గనైజర్ జీవీ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్ పేట, మే 5

## సన్మానం



అంబర్‌పేట నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీ కిరణ్‌కుమార్‌ను పలువురు నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, నాయకులు గడ్డం రవి, వెంకట్‌రెడ్డి, ముస్తాక్ తదితరులు సీఐని సన్మానించారు.

– అంబర్‌పేట, మే 5

# సర్వీసు రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలి

● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, మే 5 : అంబర్ పేట ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్ల పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా ఆయనను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కలిశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం వల్ల స్థానికుల పడ్డ ఇబ్బందులతో పాటు ప్రస్తుత సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. నత్తనడకన సాగిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులతో గత 8 ఏండ్లుగా అంబర్ పేట వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. పక్కా ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్ నిర్మాణం వల్ల అటు వేలాది మంది విద్యార్థులు, స్థానిక ప్రజలు నరకం అనుభవిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా స్థానిక వాసులకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంబర్ పేట ఫ్లై ఓవర్ నిర్మాణంతో వరంగల్ హైవే నుంచి హైదరాబాద్ నగరంలోకి వచ్చే కేవలం 10 శాతం మంది ప్రయాణికులకు మాత్రమే ఉపయోగ పడుతోందని, స్థానికులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. ఇక నైనా ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్లు, గ్రీనరీ అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు పూర్తి చేసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంబంధిత అధికారులతోని మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

## విద్యార్థుల వివరాలు పంపించాలని కళాశాలలకు ఆదేశం

ఉస్మానియా యూనివర్సిటీ : విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ చేసేందుకు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో అన్ని డిప్లొమా, యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల వివరాలు పంపించాలని ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ అన్ని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు. ఈ మేరకు ఆయా యాజమాన్యాలకు లేఖలను పంపించారు. నిర్దేశిత ఫార్మాట్లో ఆధార్ సంఖ్య, పేరు, పుట్టిన తేదీ, లింగము, మొబైల్ నంబర్, రోల్ నంబర్ తదితర వివరాలతో 2021-22 విద్యా సంవత్సరం నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు విద్యార్థులందరి వివరాలు ఈ నెల 9వ తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. లేనిపక్షంలో భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందని చెప్పారు. విదేశీ విద్యార్థుల వివరాలు అవసరం లేదని పేర్కొన్నారు.

# కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం



అంబర్‌పేటలో షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, మే 5 : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఒక వరం లాంటిదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్ గౌడ్, బి.పద్మావెంకట్‌రెడ్డి, అమృతతో పాటు తాసీల్దార్ వీరాబాయితో కలసి మండల పరిధిలో 42 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు తెలంగాణలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు.

## మొక్కల విశిష్టతపై 11న అవగాహన రన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కల్యాణి, దక్షిత, నిత్య సంతోషిణి

ఖైరతాబాద్, మే 5 : వృక్షదామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై ఈ నెల 11న గచ్చిబౌలి స్టేడియంలో 5కే, 3కే, 2కేబీ విభాగాల్లో అవగాహన రన్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కల్యాణి బెల్లంకొండ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కో ఫౌండర్ దక్షిత, నిత్య సంతోషిణి, ప్రమిత, మురళీ చదలవాడతో కలిసి ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యంగా నివారణే లక్ష్యంగా అమెరికాలో ఫౌండేషన్‌ను స్థాపించామన్నారు. సంస్థలో చిన్నారులే ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. ప్రతి సంవత్సరం ఒక లక్ష మంది రైతులకు మొక్కలను పంపిణీ చేస్తామని, మొత్తం పది లక్షల మొక్కలు నాటాలన్నది తమ లక్ష్యమన్నారు. మంత్రులు, ఉన్నతాధికారులు హాజరవుతున్నారు.

# చెత్త కుప్పలు తొలగింపు

● ఎస్‌ఎఫ్‌ఏ కు రూ.1,000 జరిమానా




చెత్త కుప్పలు తొలగించగా శుభ్రంగా మారిన రోడ్డు

మెహిదీపట్నం, మే 5: ప్రజలకు బస్తీలలో చెత్త కు ప్పలు కుప్పలుగా పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నట్లు సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన 'ఎక్కడి చెత్త అక్కడే' కథనానికి జీహెచ్ఎంసీ సర్కిల్ 12 పారిశుధ్య విభాగం అధికారులు స్పందించారు. వెంటనే సిబ్బందిని కేటాయించి చెత్త కుప్పలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత ఎస్ఎఫ్ఏకు వేయి రూపాయల జరిమానాను విధించినట్లు ఏఎంఓహెచ్ తెలిపారు.

## 'సీతాశతకం' పుస్తకావిష్కరణ సభ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి

రవీంద్రభారతి, మే 5 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, దర్పణం సాహిత్య వేదిక, అశ్విని ప్రచురణల సంయుక్త ఆధ్వర్యంలో డా.చీదెళ్ల సీతాలక్ష్మి రచించిన కవితా దర్పణం, కళారత్న శంకర నారాయణ రచించిన సీతాశతకం పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పుస్తకాలను ఆవిష్కరించారు. డా.రాయారావు సూర్యప్రకాశ్‌రావు సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి సభ నుద్దేశించి మాట్లాడుతూ రచయితలు చాలా అద్భుతమైన పుస్తకాలను రచించారని ఆయన కొనియాడారు. భవిష్యత్‌లో రచయితలు సమాజానికి తోడ్పాటునందించే మంచి కవితలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాస్యం సేనవాధిపతి, డా.రూపాదేవి, చెన్నూరి సీతారాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ లెర్నింగ్ డీప్ లెర్నింగ్ పై సమ్మర్ ఇంటర్న్ షిప్



స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మిషన్ లెర్నింగ్ డీప్ లెర్నింగ్‌పై సమ్మర్ ఇంటర్న్ షిప్ ప్రారంభోత్సవంలో అధ్యాపకులు

అబిడ్స్, మే 5: స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్‌లో మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పై సమ్మర్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ ఇంటర్న్‌షిప్ మే 5 నుండి జూన్ 13, 2025 వరకు జరుగుతుందని ప్రతి రోజూ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహించే ఈ సెషన్లు 4వ మరియు 6వ సెమిస్టర్ సీఎస్ ఈ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. మదన్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బయోటెక్ స్ఫియర్ రీసెర్చ్ ఇండియా చీఫ్ సైంటిఫిక్ అడ్వైజర్, ఏసీఎం ప్రొఫెషనల్ చాప్టర్, మీరట్ చైర్మన్ ఆర్యన్‌చౌదరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స ప్రపంచ ఆవిష్కరణలపై చూపిస్తున్న ప్రభావాన్ని వివరించారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, థామ్సన్ రాయిటర్స్ ఇండియా శీర్షారే చౌదరీ కృత్రిమ మేథ యొక్క వ్యవస్థల పనితీరు గురించి మాట్లాడారు. లీడ్ పార్టనర్ మేనేజర్, సెలోనిస్ ఇండియా పూర్ణి మదాల్ ప్రాసెస్ ఇంటెలిజెన్స్ విధానాల గురించి చర్చించారు. ఐఎక్స్‌ఏఐ టెక్నాలజీ సీఈవోనితిషా జూకారెడ్డి విద్యార్థులు చేయవలసిన ప్రాజెక్టులు మరియు ఇంటర్న్‌షిప్‌ల ప్రాముఖ్యత గురించి చర్చించారు. ఈ ఇంటర్న్‌షిప్‌కు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతిప్రొఫెసర్ ఆర్. మదన మోహన్ చైర్మన్‌గా వ్యవహరించగా డాక్టర్ డి. రాధిక, డాక్టర్ కిశోర్‌కుమార్ రెడ్డి కన్వీనర్లుగా, డాక్టర్ ఎం. సౌమ్య, డాక్టర్ పి.ఆర్. అనీషా, కోఆర్డినేటర్లుగా సీహెచ్. హరిశ్వర్‌రెడ్డి, హఫ్సా వ్యవహరించారు. ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులకు నిపుణుల మార్గనిర్దేశనతో మరియు అనుభవ ఆధారిత శిక్షణతో మెషిన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్‌లో బలమైన పునాదిని ఏర్పాటు చేయడం లక్ష్యంగా ఉందని చైర్మన్ డాక్టర్ మదనమోహన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ, రెస్పాండెంట్ కే కృష్ణారావు , మేనేజ్‌మెంట్ సభ్యులు టి. రాకేశ్‌రెడ్డి , ఆర్. ప్రదీప్ రెడ్డి , డీన్ ప్రొఫెసర్ ఏ వినయ్‌బాబు , ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక , డైరెక్టర్ డాక్టర్ వి. అనూరాధ , అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రమేశ్ పాల్గొన్నారు.

## యువతను ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



బాలెంల అవినాష్

ఉస్మానియా యూనివర్సిటీ : యువతకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు స్వయంగా వారిని నిండా ముంచుతోందని బీఆర్‌ఎస్వీ ఓయూ నాయకుడు బాలెంల అవినాష్ మండిపడ్డారు. అధికారంలో ఉండి యువతకు రాజీవ్ యువ వికాస పథకం ప్రారంభించి, దానికి రూ.6 వేల కోట్ల నిధులు కేటాయించి యువతకు ఉపాధి కల్పించేందుకు ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వ పెద్దలు నేడు మడమ తిప్పారని దుయ్యబట్టారు. బ్యాంకుల నుంచి రుణాల ద్వారా ఆర్థికసాయం అందిస్తామని చెప్పి, నేడు సిబిల్ స్కోర్ ఉంటేనే పథకానికి అర్హులని వారిని గందరగోళంలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. ఆయా బ్యాంకులు దరఖాస్తుదారుల సిబిల్ ఆధారంగా రుణాలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయంతో ఎంతో మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ నిరుద్యోగ యువతను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తికాకముందే యువత ఆశలు ఆవిరి చేశారని వాపోయారు. ఎన్నికల సమయంలో ఇస్తానన్న రెండు లక్షల ఉద్యోగాలు ఎటుపోయాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఇస్తానన్న భృతి ఏమైందని ఎద్దేవా చేశారు. విద్యార్థినులకు అందజేస్తామన్న స్కూటీ ఊసే లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా మోసం చేస్తూ పోతే రానున్న రోజుల్లో విద్యార్థులు, నిరుద్యోగులు, ఆడబిడ్డలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తప్పకుండా రానున్న రోజుల్లో వారికి ఉన్న ఏకైక ఆయుధం ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మెహిదీపట్నం, మే 5 : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్ హౌస్ లక్ష్మీ నగర్ రింగ్ రోడ్డు సమీపంలో ఫుట్ పాత్ పై గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వివరాలకు 8712660428 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఆరోగ్యంతో వ్యక్తి మృతి

కాచిగూడ, మే 5: అనారోగ్యంతో రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (55) జూకల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం చివర్లో అనారోగ్యంతో ఉంటూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని వంటిపై కాకి రంగు చొక్క, నీలిరంగు ప్యాంటు ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మెహిదీపట్నం, మే 5 : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన మెహిదీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. సీఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన లల్లు, బుజ్జి అలియాస్ లక్ష్మి(50) దంపతులు మాసబ్ ట్యాంక్ కోటమ్మ బస్తీలో నివసిస్తున్నారు. వీరికి ఇటీవలే కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ వచ్చింది. దీంతో లల్లు అక్కడే ఉంటున్నాడు. బుజ్జి ఇండ్లలో పనులు చేస్తూ కోటమ్మ బస్తీలో నివసించేది. సోమవారం మధ్యాహ్నం బుజ్జి తన ఇంట్లో మృతి చెందిపడి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. బుజ్జి గొంతు బాయ్ గోర్లతో గాట్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఆదివారం అర్ధరాత్రి ఆమె చనిపోయి ఉంటుందని సీఐ మల్లేష్ తెలిపారు, ఇది హత్య అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పహల్గాం మారణకాండను నిరసిస్తూ కవిసమ్మేళనం



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న కవులు, సాహితీవేత్తలు

రవీంద్రభారతి,మే 5 : భారత్ వికాస పరిషత్ తెలంగాణ ప్రాంత్, బీవీపీ చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో పహల్గాం మారణకాండను నిరసిస్తూ కవులు, సాహితివేత్తల హైదవ శంఖారావం, కవిసమ్మేళనం నిర్వహించారు. హైదవ శంఖారావం కార్యక్రమంలో అధ్యక్షుడు నాగశేఖర్‌గుప్తా, పోషకులు సీహెచ్ హనుమంతరావు, ఆచార్య ముదిగొండ శివప్రసాద్, మావుడూరు సూర్యానారాయణమూర్తి, ఇందు శేఖర్ అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ.. ఇది ఇప్పటి సమస్య కాదని, దీనికి శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని అన్నారు. ప్రతి భారతీయుడు నిద్రమత్తును వదలి చైతన్యంతో తీవ్రవాదుల దుశ్చర్యలను తీవ్రంగా ఖండించాలని అన్నారు. భారత సైనికులకు అండంగా ఉండి సైనికుల, మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు. శ్రీకెసిపిగుప్తా, పెద్దూరి వెంకటదాసు సాంబమూర్తి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత సుకృత్‌కుమార్

శంషాబాద్ రూరల్, మే 5 : పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు వస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సుకృత్ కుమార్ తెలిపారు. సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మున్సిపాలిటీ కోత్వాల్ గూలో రైతులకు వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి శ్వేత ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాస్త్రవేత్త సుకృత్ కుమార్ మాట్లాడుతూ.. పంట మార్పిడిలతో అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. రైతులు వారి భూముల్లో వ్యవసాయం చేయడానికి యూరియా, ఎరువులు మోతాదులో వాడితే ఎలాంటి ఇబ్బందులు ఉంవని వివరించారు. తక్కువ నీటితో అధికంగా దిగుబడులు సాధించడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్, విస్తరణ అధికారి సురేశ్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జాతి నిర్మాతలుగా ఎదగాలి

బండ్లగూడ, మే 5: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో బాల బాలికల వ్యక్తిత్వ వికాసానికి సంస్కార సాధనా వర్గానిన శ్రీ సరస్వతి విద్యా పీఠం తెలంగాణ అకడమిక్ ఇన్‌చార్జి నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలబాలికలకు చక్కటి విద్యా, సంస్కారములను అందించేందుకు విద్యారంగంలో విద్యా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. శిశు మందిరంలో చదువుతున్న బాలబాలికలకే కాకుండా సమాజంలోని అందరి బాల బాలికలకు సంస్కారములు అందాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి సెలవులలో చిన్నారి బాల బాలికల వ్యక్తిత్వ వికాసమునకు అవసరమయ్యే విధంగా దేశ భక్తుల కథలు, మహాపురుషుల జీవిత చరిత్రలు, సంగీతం , వేద గణితం తదితర విషయాలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకావాలని సూచించారు. శ్రీ సరస్వతి విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి సీతారాములు మాట్లాడుతూ ఇలాంటి వాటిని నిత్య జీవితంలో కూడా అలవాటు చేసుకొని భవిష్యత్తులో చక్కటి మార్గదర్శకులుగా తయారు కావాలన్నారు. పారిశ్రామిక వేత్త వేద ప్రకాశ్ అగర్వాల్, చెరువు రాంబాబు, శ్రీ సరస్వతి విద్యా పీఠం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పరమానంద బన్సల్, రంగా రెడ్డి జిల్లా అధ్యక్షుడు గున్నాల దశరథ రెడ్డి, , మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజ నర్సయ్య పాల్గొన్నారు .

## ఎమ్మెల్యేను కలిసిన లంగర్‌హౌస్ సీఐ



ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లంగర్ హౌస్ సీఐ బి. వెంకటరాములు

మెహిదీపట్నం, మే 5: లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన బి. వెంకటరాములు సోమవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుదీన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

**జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే భేటీ..**

ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల గురించి జోనల్ కమిషనర్‌తో చర్చించారు. సంబంధిత కాంట్రాక్టర్లతో, అధికారులతో మాట్లాడి పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ చర్యలు చేపడతామని అన్నారు.

## కులగణనను చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం

**డాక్టర్ వెన్న ఈశ్వరప్ప, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

అబిడ్స్, మే 5 : దేశ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, జనాభా లెక్కలతోపాటు కులగణనను చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేబినెట్ మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో పరిపాలించిన పాలకులు అధికారంలో ఉన్న 60 సంవత్సరాల్లో ఒక్కసారి కూడా కులగణన చేపట్టకపోవడం శోచనీయమన్నారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేపట్టాలన్నది చారిత్రాత్మక నిర్ణయం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, దేశ సమగ్ర ప్రగతి కోసం దోహదపడుతుందని అన్నారు. 94 సంవత్సరాల తర్వాత మోదీ ప్రభుత్వం ఈ ప్రక్రియను తిరిగి ప్రారంభించడం అనేది సమాజంలోని బడుగు, బలహీన వర్గాలు, దళితులు వంటి అన్ని వర్గాల శ్రేయస్సు కోసం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని, ఏప్రిల్ 30వ తేదీ చరిత్ర పుటల్లో లిఖించదగిన రోజుగా నిలుస్తుంది అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు వివిధ వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా హక్కులు కల్పించారని పేర్కొన్నారు. నేడు దేశ ప్రజలంతా ముఖ్యంగా ఓబీసీ వర్గానికి చెందిన వారు నరేంద్ర మోదీ అభినవ అంబేద్కర్, అభినవ జ్యోతిబా పూలేగా అభివర్ణిస్తున్నారని ఆయన తెలిపారు.